నవతెలంగాణ 1
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
మంగళవారం | 18 జూన్ 2024 | www.navatelangana.com

త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ



నవతెలంగాణ-రాయపోల్, దౌల్తాబాద్

త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకొంటారు. ఈద్ అల్ అద్హా అని పిలిచే బక్రీద్ ముందు రోజు ముస్లింలు మరణించిన తమ కుటుంబసభ్యుల సమాధుల వద్ద వారికి ఇష్టమైన దుస్తులు, ఆహార పదార్థాలను ఉంచు తారు. ఇలా చేయడం వల్ల వారు స్వర్గం నుంచి వాటిని స్వీకరిస్తారని నమ్ముతారు.సోమవారం రాయ పోల్ మండలంలోని రాయపోల్, మంతూర్, రాంసాగర్, సయ్యద్ నగర్, దౌల్తాబాద్ మండలం అహ్మద్ నగర్, దొమ్మాట, దౌల్తాబాద్, మల్లేశం పల్లి, ఇందు ప్రియాల్ పలు గ్రామాలలో బక్రీద్ వేడుకలు ముస్లిం ఘనంగా నిర్వహించుకున్నారు. రంజాన్‌లాగే బక్రీద్ పండుగను కూడా ఖుద్బా అనే ధార్మిక ప్రసంగంతో ప్రారంభిస్తారు. సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఆ తర్వాత ఖుర్బానీ పేరిట జంతువులను బలిస్తారు. ఖుర్బానీ అంటే బలిదానం ఇవ్వడం, త్యాగం అనే అర్థాలున్నాయి. ఖుర్బానీ ఇవ్వడానికి హజరత్ ఇబ్రహీం అనే ప్రవక్త త్యాగమే కారణమని భావిస్తారు. ఈద్గా మైదానాల్లో సామూహిక నమాజ్ ప్రార్థనలు నిర్వహించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఘనంగా నిర్వహించుకున్నారు.

హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం మార్నింగ్ వాక్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్ పట్టణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం మార్నింగ్ వాక్ చేశారు. పట్టణంలోని పలు వీధుల గుండా నడుస్తూ ప్రజలతో ముచ్చటించారు. పట్టణంలోని పలు సమస్యలను ప్రజలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన మంత్రి అధికారులతో మాట్లాడి సమస్య వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం హుస్నాబాద్ పట్టణంలో జరుగుతున్న రోడ్డు వైండింగ్, నాళాల నిర్మాణాలను పరిశీలించారు. పట్టణంలోని విజయ పాల ఉత్పత్తిదారుల సహాయ సహకార సంఘాన్ని సందర్శించారు. పడి రైతులకు పాలతో ఇలాంటి లాభాలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. బక్రీద్ పర్వదినం పురస్కరించుకొని ముస్లిం సోదరులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మండల అధ్యక్షుడు బంక చందు, కేడం లింగమూర్తి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మరో రెండు పీజీ కోర్సులు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు
- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.2కోట్ల 50లక్షలతో నిర్మించే
- 12 అదనపు తరగతి గదుల నిర్మాణం వెంటనే చేపట్టాలి

నవతెలంగాణ-సిద్దిపేట



ప్రభుత్వ ఆటానమస్ డిగ్రీ కళాశాలలో మరో రెండు పీజీకోర్స్‌లు, అదేవిదంగా మిట్టపల్లి వద్ద ఉన్న మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ఒక పీజీ కోర్సు మంజూరు అయినట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట ప్రభుత్వ ఆటానమస్ డిగ్రీ కళాశాలలో ఇప్పటికే 10 కోర్సులతో పీజీ తరగతులు నడుస్తున్నాయని, కొత్తగా ఎమ్మెస్సి మైక్రో బయాలజీ, ఎమ్మెస్సి కంప్యూటర్స్ 60 సిట్ల చొప్పున ఈ సంవత్సరం నుంచి ప్రారంభం కానుందని తెలిపారు. అదే విధంగా మిట్టపల్లి వద్ద నడుస్తున్న మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో పీజీ కళాశాలగా అప్గ్రేడ్‌తో ఒక పీజీ కోర్సు మంజూరు అయిందని, ఎమ్మెస్సి పిజిక్స్ కోర్స్ ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం కానుందని తెలిపారు. డిగ్రీ కళాశాలలో రూ.2కోట్ల 50 లక్షలతో నిర్మించే 12 అదనపు తరగతుల గదుల నిర్మాణం వెంటనే చేపట్టాలని సంబందిత అధికారులను ఆదేశించారు.

అనారోగ్యంతో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

- అల్లుడి మరణ వార్త విని
- అత్త గుండెపోటుతో మృతి

నవతెలంగాణ-చేగుంట



(ఫైల్)

చేగుంట మండల పరిధిలోని మక్క రాజుపేట గ్రామంలో విషాదఛాయలు చోటుచేసుకున్నాయి. మక్క రాజుపేట గ్రామానికి చెందిన మంగలి నరసింహులు (50) మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా అస్వస్థత గురి కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. నర్సింహులు మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చి ఇంట్లో ఉండగా అతని అత్త నరసవ్వ (62) మృతదేహాన్ని చూస్తూ రోదిస్తూ ఒకేసారి గుండెపోటుతో మరణించింది. ఒకవైపు అల్లుడు మృతి చెందిన గంటల వ్యవధిలోని అత్త కూడా మృతి చెందడంతో కుటుంబంలో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మంగలి నరసింహులు మృతి ఎంతో బాధాకరమని ఏపీవో శ్వేత పేర్కొన్నారు.



మున్సిపల్ చైర్మన్ రాజమౌళికి ఆహ్వాన పత్రిక

- అందజేసిన వంగపల్లి అంజయ్య స్వామి

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళికి సోమవారం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ప్రమాణ స్వీకారం ఆహ్వాన పత్రిక అందజేసిన రాష్ట్ర ధార్మిక పరిషత్ చైర్మన్ డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి, సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వంగపల్లి అంజయ్య స్వామి మాట్లాడుతూ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ కమిటీ ప్రమాన స్వీకార కార్యక్రమానికి రావాల్సిందిగా మున్సిపల్ చైర్మన్ రాజమౌళికి ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగిందని, అలాగే సీనియర్ నాయకులు నంగునూరి సత్యనారాయణ, సిద్ది బిక్షపతి, తోట బిక్షపతి, సిద్దిపేట జిల్లా ఐవిఎఫ్ అధ్యక్షుడు నేతి శ్రీనివాస్, యువజన అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్, ఐవిఎఫ్ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణ అధ్యక్షుడు కైలాస ప్రభాకర్, యువజన అధ్యక్షుడు కొమరవెల్లి శ్రవణ్, ఆర్యవైశ్య నాయకులకు ప్రమాణ స్వీకారం ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగింది అని ఆర్యవైశ్యులకు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ అండగా ఉంటుందని అన్నారు.



డాక్టర్ నరేంద్ర కుమార్‌కు ఏపీజే అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ అవార్డు

నవతెలంగాణ-సిద్దిపేట

వైద్యరంగంలో చేస్తున్న సేవలకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం హెల్త్ అండ్ మెడికల్ ఎక్సలెన్స్ అవార్డు 2024ను పట్టణానికి చెందిన, సన్ రైజ్ హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ నరేందర్ కుమార్ హైదరాబాదులో అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాదు హైటెక్స్‌లో ఆక్ట్‌నౌ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో సైబరాబాద్ డిఎస్పి వినిత్ రావు చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ డాక్టర్ స్వాతి, కె ఎస్ మూర్తి పాల్గొన్నట్లు తెలిపారు.

సాయిబాబా ఆలయంలో 13వ వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో చిన్న షిరిడీగా పిలువబడే సాయిబాబా దేవాలయంలో సోమవారం 13వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు గౌరీభట్ల శంకర్ శర్మ సిద్ధాంతి, అనిల్ శర్మ సిద్ధాంతి తెలిపారు. ఈ సందర్భంగా గౌరీభట్ల శంకర్ శర్మ మాట్లాడుతూ సాయిబాబా దేవాలయంలో వార్షికోత్సవం సందర్భంగా ఉదయమే సుప్రభాత సేవ, స్వామివారికి అలంకరణ, అభిషేకం, హారతి, మహా నివేదన, మంత్రపుష్పములు తదితర కార్యక్రమాలు నిర్వహించి అనంతరం అన్నదానం నిర్వహించినట్లు పేర్కొన్నారు.

లారీ ఢీకొని యువకుడు మృతి

నవతెలంగాణ-ములుగు



లారీ ఢీకొని యువకుడు మృతి చెందాడు ఈ సంఘటన సోమవారం ఉదయం 09:05 నిమిషాలకు ములుగు మండల కేంద్రమైన వంటిమామిడి రాజీవ్ రహదారిపై జరిగింది ఎస్సై విజయ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి నేరేడ్మెట్ ఎక్స్ రోడ్ జె జె నగర్ కాలనీకి చెందిన ప్రకాష్ ప్రణీత్ కుమార్ (25) పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వస్తుండగా మార్గ మధ్యలో వంటిమామిడి గ్రామ శివారులో కారును ఓవర్టేక్ చేస్తుండగా కారుకు తగిలి కింద పడగా వెనుక నుండి వస్తున్న లారీ ఢీకొని అక్కడికక్కడ మృతి చెందాడు.

ఆవు పేర.. అల్లర్లు

- మూక దాడులు.. ఉద్రికతతలు
- బక్రీద్ పండగ నేపథ్యంలో గొడవకు ప్లాన్
- అల్లర్లకు పాల్పడిన 21 మంది అరెస్ట్
- భారీ పోలీస్ బందోబస్త్...బక్రీద్ ప్రశాంతం
- అక్రమ అరెస్టులంటూ బీజేపీ బంద్
- చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఉపేక్షించేదిలేదు: ఎస్పీ

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

> ఆవుల మంద పేర అల్లర్లు. మూక దాడులు. ఉద్రిక్తతలు. అరెస్టులు.. నిరసనలు.. బంద్‌లు ఇదీ..! మెతుకు సీమ మెదక్‌లో నెలకొన్న దురదృష్టకర సంఘటన. సమస్య చిన్నదే కానీ..! దాన్ని చూసే కోణమే చాలా పెద్దది. ఎంత పెద్దదంటే ఆహారపు అలవాట్లపై ఆంక్షలు పెట్టి మనుషుల మధ్య మత వైషమ్యాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధిపొందేంత పెద్దది. మత సామరస్యంతో ప్రశాంత వాతావరణంలో మెలిగే మెదక్ ప్రజల మధ్య గోవధ వద పేర కొత్త సమస్యను సృష్టించడం వెనకాల పెద్ద ఎజెండానే దాగి ఉందనేది రాజకీయ విశ్లేషకుల మాట.

గోవధ పేర అల్లర్లు...

మెదక్ పట్టణంలో జరిగింది గోరంత అయితే అల్లరి మాత్రం కొండంత చేశారు. మెదక్ పట్టణంలో ఓ ప్రాంతంలో గోవధ కోసం ఆవుల్ని బంధించారంటూ పోలీస్‌లకు పిర్యాదు చేశారు. అంతలోనే అప్రమత్తమైన పోలీసులు సదరు ప్రాంతానికెళ్లి చూశారు. అక్కడ ఆవులనేవి లేవు. కానీ..! ఒక వ్యక్తి ఎద్దుల్ని మేత మేపుతున్నారు. అంతటితో ఆగకుండా మరో చోట ఆవుల్ని కోసేందుకు ఉంచారంటూ ఓ గుంపు అక్కడికెళ్లింది. అక్కడ ఓ వ్యక్తితో గొడవకు దిగి దాడి చేశారు. అంతటితో ఆగకుండా తల్లిలా బావించి పూజించే ఆవుల్ని గోసేందుకు ఓ మతం వాళ్ల ప్రయత్నిస్తున్నారంటూ ఆహారపు అలవాట్లను కాస్త మతానికి పులిమి ఉద్రిక్తతకు దారి తీసేలా చేశారు. పుకార్లతో మొదలైన గొడవ కాస్త సాయంత్రం వరకు తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసేలా చేశారు. అంతటితో ఆగకుండా కొందర్ని టార్గెట్ చేసి విధ్వంసానికి పాల్పడ్డారు. ఆస్తుల్ని ధ్వంసం చేశారు. మెదక్ పట్టణంలో భయానక పరిస్థితి నెలకొనేలా చేశారు. బక్రీద్ పండగ కోసం ముస్లీం సాంప్రదాయం ప్రకారం ఎద్దు మాంసాన్ని దానం చేయడం సహజం. మాంసం తినేవాళ్లు తింటారు. తినని వాళ్లు తినరు. ఎవరి ఆహారపు అలవాట్లు వారివి అయినప్పటికీ కొందరు అల్లర్లు సృష్టించే కుట్రలో భాగంగా మెదక్‌లో గోవధ పంచాయతీని తెరమీదికి తెచ్చినట్లు తెలుస్తోంది. పశువుల్ని అక్రమంగా రవాణా చేస్తే చట్ట ప్రకారం పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఎవర్నీ వదిలిపెట్టరు. కానీ..! మెదక్‌లో పోలీసులు పట్టించుకుని ఆవులున్నాయని చెప్పిన ప్రాంతానికి వెళ్లి చూశారు. అక్కడ ఆవులు కావు ఎద్దుల్ని మేపుతున్నట్లు నిర్ధారించారు. అయినా మరో చోట ఆవులున్నాయని చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటూ దాడులకు పాల్పడాన్ని పౌర సంఘాలు ఖండిస్తున్నాయి.

భారీ బందోబస్త్... ప్రశాంతంగా బక్రీద్

మెదక్‌లో చెలరేగిన అల్లర్ల నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్త్ ఏర్పాటు చేశారు. అల్లరి మూకల్ని కట్టడి చేశారు. మల్టీజోన్ కమిషనర్ రంగనాథ్ రంగంలోకి దిగి పరిస్థితుల్ని అదుపులోకి తెచ్చారు. అల్లరి మూకల్ని గుర్తించి అరెస్టు చేశారు. బక్రీద్ పండగ ఉన్నందున గొడవలు జరగకుండా కూడా ప్రతి ఈద్గా దర్గాల వద్ద పోలీస్ పహారా పెట్టారు. ముస్లీం సోదరులంతా పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకున్నారు. అంతకు ముందు రోజు గొడవలు జరిగినప్పటికీ ముస్లీం సోదరులు ఎక్కడా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడలేదు. పైగా బీజేపీ, భగరంగ్‌దల్, ఇతర హిందూవాహినీ సంస్థలు బంద్ పేరిట అడావుడి చేసినా పండగ మాత్రం ప్రశాంతంగా జరగడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

అల్లర్లకు పాల్పడిన 21 మంది అరెస్టు: ఎస్పీ కృష్ణస్వామి

మెదక్ పట్టణంలో గోవధకు పాల్పడుతున్నారంటూ ఓ వర్గంపై అభియోగం మోపుతూ అల్లర్లకు పాల్పడి ఆస్తుల్ని ధ్వంసం చేసిన, అరాచకంగా వ్యవహరించి కొందర్ని పోలీసులు అరెస్టు చేశారు. వీడియో పుటేజ్ ఆధారంగా అల్లర్లకు పాల్పడిన వ్యక్తుల్ని 21 మందిని అరెస్టు చేశారు. అల్లర్లలో వందల సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తుంది. వీడియోల ఆధారంగా అల్లర్లకు పాల్పడిన వ్యక్తుల్ని గుర్తిస్తున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందాలు వెతుకుతున్నాయని ఎస్పీ కృష్ణ స్వామి తెలిపారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదన్నారు. అలా వ్యవరిస్తే ఎవర్నీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఆవుల్ని కోసేందుకు తెచ్చారంటూ సమాచారం వచ్చిన వెంటనే తనిఖీ చేయగా అక్కడ ఓ వ్యక్తి ఎద్దుల్ని మేపుతున్నట్లు గుర్తించామన్నారు. మరో చోట ఆవులున్నాయంటూ కొందరు వెళ్లి అక్కడ గొడవ పడి ఓ వ్యక్తిని కొట్టడం జరిగిందన్నారు. మెదక్‌లో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం ఉందన్నారు. భారీ బందోబస్త్ నెలకొల్పామన్నారు. బక్రీద్ పండగ రోజున ముస్లీంలు ప్రశాంతంగా పండగ చేసుకున్నారన్నారు. ఎక్కడా అల్లర్లు జరగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అల్లర్లలో పాల్గొన్న వాళ్లనే అరెస్టు చేశామన్నారు. ఎవరి వత్తిళ్లకు ప్రలోభపడే పరిస్థితి పోలీసులకు లేదన్నారు.

అక్రమ అరెస్టులంటూ బీజేపీ బంద్

మెదక్‌లో అల్లర్లకు పాల్పడిన వ్యక్తుల్ని వీడియో పుటేజీ ఆధారంగా పరిశీలించిన పోలీసులు అందులో పాల్గొన్న వాళ్లను గుర్తించి అరెస్టు చేశారు. ఇంకొందర్నీ కూడా అరెస్టు చేసేందుకు వెతుకుతున్నారు. అయితే బీజేపీ, దాని అనుబంధ సంఘాలు మాత్రం పోలీసులు అక్రమంగా కేసులు పెట్టి తమ వాళ్లను అరెస్టు చేశారంటూ ఆరోపిస్తున్నాయి. అల్లర్లు జరిగినప్పుడు లేని వ్యక్తుల్ని కూడా అరెస్టు చేశారంటూ ఆందోళనకు దిగింది. సోమవారం బక్రీద్ పండగ ఉన్నప్పటికీ కవ్వింపు చర్యలకు పూనుకుని మెదక్ పట్టణంతో పాటు జిల్లావ్యాప్తంగాపలుమండలాల్లోనూ బంద్ చేయించారు.



అల్లర్ల నేపథ్యంలో మెదక్‌లో కొనసాగుతున్న బంద్..

మత్య సామరస్యాన్ని కాపాడాలి..

> మతాల పేరిట అల్లర్లు సృష్టించడం సరైందికాదు. బక్రీద్ పండగ సందంర్భంగా ముస్లీం మైనార్టీపై గోవధ పేరిట దాడులకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండి స్తున్నాం. అల్లర్లకు పాల్పడి ఉద్రిక్తతలు సృష్టించిన వారిని కఠినంగా శిక్షించాలి. మెదక్ జిల్లాలో అన్ని మతాల వాళ్లు స్వేచ్ఛగా బతుకుతున్నారు. అలాంటి వాళ్ల మధ్య సమస్యలు సృష్టించి అల్లర్లకు పాల్పడితే చట్టం కఠినంగా వ్యవహరించాలి.
> -ఎ.మల్లేశం, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

కార్మిక వర్గ పోరాటాల సారధి సీఐటీయూ

- సీఐటీయూ కేంద్ర కమిటీ సభ్యులు భూపాల్

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్



కార్మిక వర్గ పోరాటాల రథసారథి సిఐటియు అని సీఐటీయూ జాతీయ కమిటీ సభ్యులు భూపాల్ గారు అన్నారు. సోమవారం సిద్దిపేట సిఐటియు జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు రెండవ రోజు కార్మికుద్యమ చరిత్ర క్లాస్ బోధించడానికి సిఐటియు జాతీయ కమిటీ సభ్యులు భూపాల్ గారు హాజరై క్లాసు బోధించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు 1970లో ఏర్పడి 54 సంవత్సరాల కాలం పూర్తవుతుంది నాటి నుంచి నేటి వరకు కార్మిక వర్గ ప్రయోజనాలు కాపాడేదాంట్లో అగ్రభాగాన నిలబడిందని అనేక సమ్మెలు పోరాటాలు ఆందోళనలు నిర్వహించి, అనేక కార్మిక చట్టాలు సాధించడంలో అగ్రభాగాన నిలబడిందని ఆయన అన్నారు. దోపిడి ఉన్నంతకాలం పోరాటం కొనసాగుతూ ఉంటుందని పెట్టుబడిదారి సమాజంలో కార్మికుల శ్రమ దోపిడీకి గురిచేస్తారని అలాంటి సందర్భంలో ఎర్రజెండా సిఐటియు కార్మిక వర్గం పక్షపాతిక ఉంటూ వారి ప్రయోజనాలు కాపాడటానికి ఉంటుందన్నారు. దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల పట్ల, గత పది సంవత్సరాల కాలంలో 8 సమ్మెలు నిర్వహించిందని ఈ సమ్మెలో అన్ని కార్మిక సంఘాన్ని ఐక్య పరచడంలో సిఐటియు అగ్రభాగాన నిలబడిందన్నారు. ఆ సమ్మెల ఫలితంగా నేడు బీజేపీ ప్రభుత్వం కార్మిక కొడ్లను అమలు చేయడంలో వెనుకడుగు వేసిందని అన్నారు. నేడు తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయాలని యోచనలో ఉందన్నారు దాన్ని రాబోయే కాలంలో తిప్పికొడతామని ఆ శక్తి సిఐటియుకి ఉందన్నారు. ఇప్పటికే దేశంలో కార్మిక వర్గ ప్రయోజనాలు కాపాడడానికి కోసం కనీస వేతనాలను అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ప్రతి కార్మికుడికి పిఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, పని భద్రత కల్పించాలని, ఎనిమిది గంటల పని విధానం ఉండాలని పని భారం తగ్గించాలని తదితర అంశాలపై అనునిత్యం కార్మిక వర్గ ప్రయాణాల కోసం పోరాడుతుందన్నారు, రాబోయే కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే కార్మిక వ్యతిరేక విధానాల పట్ల అప్రమత్తంగా ఉండి కార్మిక వర్గాన్ని చైతన్యపరిచి పోరాటాలకు ఊపిరిపోస్తామని ఆయన అన్నారు. ఈ క్లాస్ ప్రిన్సిపాల్‌గా సిఐటియు జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య వ్యవహరించగా కార్మిక ఉద్యమ చరిత్ర చరిత్ర క్లాసును భూపాల్ గారు చెప్పగా, మధ్యాహ్నం క్లాసు సిఐటియు విశిష్టత, నిర్మాణం క్లాసులు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్ గారు, ఈ క్లాసులో సిఐటియు జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, జిల్లా కోశాధికారి జి భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు బండ స్వామి, కాట మధు, ఎం పద్మ జిల్లా సహాయ కార్యదర్శులు చొప్పరి రవికుమార్, సింగిరెడ్డి చంద్రారెడ్డి, తునికి మహేష్ ఇప్పకాయల శోభ జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల నర్సయ్య, వేణుగోపాల్, గుంటుపల్లి సుధాకర్, రాళ్ల బండి భాస్కర్, కృష్ణమూర్తి ఆరుట్ల రవి, లక్ష్మి, ప్రవీణ, వసంత, పద్మ వివిధ యూనియన్ల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట

నవతెలంగాణ-కొండపాక

వర్షాకాలం ప్రారంభం నుంచి వర్షాలు పడకపోవడంతో కుక్కునూరు పల్లి లో పిల్లలు వర్షం పడాలని కప్పతల్లి కప్పను తెల్ల బట్టలో కట్టి రోకలికిపై వేసుకొని ఇద్దరు పిల్లలు మోస్తూ ఇంటింటికి తిరిగి బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నప్పటికీ చినుకు పడడం లేదనారు. విత్తనాలు విత్తుకోవడానికి అదునుతప్పుతుందని పంటలు పండుతేనే రైతులు బాగుంటారని రైతులు బాగుంటేనే మా విద్యాభ్యాసం అటంకం లేకుండా కొనసాగుతుందని, ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు సకాలంలో వర్షాలు పడి రైతులను ప్రజలను ఆదుకోవాలని వరుణ దేవుని ప్రార్థించారు.

మేరిండ్ల శ్రీనివాస్ గౌడ్ ఆశయాలను కొనసాగిస్తాం

- తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి.రమణ
- గీత సంఘం ఆధ్వర్యంలో శ్రీనివాస్ గౌడ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-చేర్యాల



అస్వస్థతకు గురై అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందిన తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మేరిండ్ల శ్రీనివాస్ గౌడ్ ఆశయాలను కొనసాగిస్తామని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి. రమణ తెలిపారు. శ్రీనివాస్ స్వగ్రామం చేర్యాల మండలం ముస్త్యాలలో సోమవారం ఆయన సంతాప సభ కెజికెయస్ జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సంతాప సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన రమణ మాట్లాడుతూ కల్లు గీత కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో శ్రీనివాస్ పాత్ర ఎంతో ఉందన్నారు. సిద్దిపేట జిల్లాలో కల్లు గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి సోషల్ మీడియా ద్వారా తీసుకువచ్చి అవి పరిష్కారం అయ్యే వరకు పోరాటాలు, ఉద్యమాలు చేశాడని తెలిపారు. ఆయన మృతి కల్లు గీత కార్మిక సంఘానికి తీవ్ర లోటని అన్నారు. ఆ కుటుంబానికి తమ సంఘం తరుపున సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని తెలిపారు. అందులో భాగంగానే రూ.1 లక్ష 50 వేలు ఆర్థిక సాయం చేశామని, ఇంకా సాయం చేస్తామని తెలిపారు. ఒక కల్లు గీత కార్మిక సంఘమే కాకుండా పట్టు రైతుల సంఘం రూ.60 వేలు, కల్లు గీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ రూ.50 వేలు ఆర్థిక సాయం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెజికెయస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కోహెడ కొమురయ్య గౌడ్, రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్, ఆశన్న గౌడ్, జంగన్న, బాల్నే వెంకట మల్లయ్య, కరీంనగర్ జిల్లా కార్యదర్శి తిరుపతి గౌడ్, లింగం, నర్సింహులు, వేంకటేశ్వర్లు, బాల్ నారాయణ, సిపిఎం చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో, పట్టు రైతుల సంఘం రాష్ట్ర నాయకులు ఐలయ్య, నర్సింహులు, చంద్ర మజుందార్, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ సురుగు రాజేష్, సిద్దిపేట జిల్లా కో కన్వీనర్ నవీన్, శ్రీనివాస్, శంకరయ్య మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

యువ స్ఫూర్తికీ మాజీ మంత్రి హరీశ్ రావు హ్యాట్సఫ్

నవతెలంగాణ-నంగునూరు



రక్త దానం చేస్తూ ప్రాణదాతలుగా నిలుస్తున్న నంగునూరు మండలం రాజ గోపాల్ పేట గ్రామ యువకులను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడేందుకు రక్తం ఎంతో అవసరం పడుతుందన్నారు. అలాంటి సమయాల్లో రక్తం అందించే ప్రతి ఒక్కరూ ప్రానదాతలే అని చెప్పారు. రక్తదాన ప్రాముఖ్య తను ప్రజలకు వివరిస్తూ సిద్దిపేట నియోజకవర్గం నంగు నూరు మండలం రాజ గోపాల్ పేట గ్రామంలోని యువకులు ఆదర్శంగా నిలవడం గొప్ప విషయమని యువత స్ఫూర్తికి నా హ్యాట్సఫ్ అని తెలియజేశారు. ఒక్కొక్కరు 20 నుంచి 30 సార్లు రక్త దానం చేశారు, అంటే వెల మంది ప్రాణాలు వారు కాపాడారన్నారు. ఎన్నో కుటుం బాల్లో వెలుగు నింపారన్నారు. ప్రమాదాలు జరిగినపుడు, సకాలంలో రక్తం అందక చనిపోతున్నవారు ఎందరో అత్యవసర చికిత్సలు, క్లిష్టమైన ప్రసవాల సమయంలో రక్తం ఎంతో అవసరమవుతుందన్నారు. దేశంలో ప్రతి రెండు సెకండ్లకు ఒకరికి రక్తం అవసరమవుతుందని సరైన అవగాహన లేనందున రక్తదానం చేసేవారి సంఖ్య పూర్తిగా తగ్గిపోయిందన్నారు. అలాంటి గొప్ప కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతూ రక్త దానం చేస్తున్న రాజ గోపాల్ పేట యువకులకు హరీశ్ రావు అభినందనలు తెలిపారు. మీ స్ఫూర్తి భావి తరాలకు ఆదర్శం. ఇదే స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమంలో యువకులు ముందుకు రావాలని అందుకు నా సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. రక్తదానం మరొకరి జీవితానికి వెలుగు, రక్తదానం చేయండి, ప్రాణదాతలుకండి, అంటూ ఎన్నో స్వచ్ఛంద సంస్థలు, వైద్యులు పలు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు చేస్తుండడాన్ని మనం చూస్తూనే ఉంటామన్నారు. మూడు నెలలకోసారి రక్తదానం చేయడం వల్ల సదరు వ్యక్తి ఆరోగ్యంగా ఉండడంతో పాటు ప్రమాదకర పరిస్థితుల్లో మరొకరికి ప్రాణదానం చేసినవారవుతారని చెప్పారు.

దళితుల భూములు గుంజుకున్నారు

- క్షీరసాగర్ భూ నిర్వాసితుల గోడు

నవతెలంగాణ-ములుగు



ములుగు మండలం క్షీరసాగర్ గ్రామంలో దళితుల భూములు గుంజుకున్నారని గోడు వెళ్ళబోశారు. 1954 సంవత్సరంలో ఈ భూమి జహీర్ నిస్సా బేగం పేరు మీద ఉంది. మాకు 60 సంవత్సరాల క్రితం ఇచ్చారు సర్వే నంబర్ 161,161/1,161/2 గల భూములను కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి కొమ్మారెడ్డి లలితా భాయ్ ఈ భూములను 13%ఎ% సర్టిఫికెట్ కింద ఈ భూములు మాకు ఇచ్చారు ఈ భూములను మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డి రెడ్ మార్క్ అదేవిధంగా కాల్వ పోతుందని చెప్పి రైతుల దగ్గర నుంచి లాక్కొని కంపెనీలకు అమ్మేశారు అప్పుడు అసైన్మెంట్ భూములుగా ఉన్నా భూములు ఇప్పుడు పట్టాలు ఎలా మారాయి అని రైతులు అంటున్నారు, ఈ భూములను వెంకట్రాంరెడ్డి ఇండస్ వ్యాలీ ఇండియా రియాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి, శాన్వి ప్రాపర్టీ, ఎమ్మెస్ సత్య గార్డెన్‌కు మూడు ఈ భూమి 143 ఎకరాలు అమ్మారు అన్నారు, ఈ భూమి మొత్తం 225 ఎకరాలు, మా భూములు మాకు తిరిగి ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

అంతర్జాతీయ ప్రపంచ కరాటే డే వేడుకలు



నవతెలంగాణ-సిద్దిపేట

జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా, సిద్దిపేట జిల్లా కరాటే షోటొకన్ స్టైల్ వారి ఆధ్వర్యం లో అంతర్జాతీయ ప్రపంచ కరాటే డే వేడుకలను సహస్ర హైస్కూల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ మెంబర్ దరిపల్లి చంద్రం మాట్లాడుతు, ఈ శిక్షణ కరాటే నేర్చుకోవడం వలన ఇమ్యూనిటీ పవర్, బాడీ ఫ్లెక్సిబల్, వేట్లాస్‌తో పాటు శారీరకగాను, మానసికగాను ఎంతోగానో దోహదపడుతుందన్నారు. ఈ కరాటే ఆత్మరక్షణ, ఆత్మ విశ్వాసం, క్రమశిక్షణ, ఆరోగ్యం, బరువు నియంత్రణ మారుతున్న సమాజానికి అనుగుణంగా, నానాటికి పెరుగుతున్న ఆకతాయిల అకృత్యాలను ఎదుర్కోవడానికి అమ్మాయిల స్వీయరక్షణకు, ఆత్మరక్షణకు కరాటే యుద్ధ కళ ఎంతో ఉపయోగప డుతాయన్నారు. 50 మంది కరాటే చిన్నారులు సమ్మర్ క్యాంపు సర్టిఫికెట్స్ జోనల్ చీఫ్ రామినీ భాగ్యరాజ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఇండియా చీఫ్ రాపోలు సుదర్శన్, సహస్ర స్కూల్ కరెస్పాండంట్ శ్రవణ్, ప్రిన్సిపాల్ శాంతి కిరణ్, అనోజిగూడ కరాటే కోచ్ సాయికిరణ్, బ్లాక్ బెల్ట్స్ రాజు, ఎల్లేష్, ప్రవీణ్, సాత్విక్, కీర్తన మాస్టర్‌తో పట్టు కరాటే చిన్నారులు, తల్లీ తండ్రులు పాల్గొన్నారు.

పట్నం మాణిక్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ-సంగారెడ్డి

పట్నం మాణిక్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతీ సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో (48)వ సోమవారం కూడా అన్నదానం దిగ్విజయంగా పూర్తి అయిందని బీఆర్ఎస్ యువనాయకుడు పట్నం రవితేజ అన్నారు. ప్రతీ సోమవారం సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ మహిళలు ఆస్పత్రి సిబ్బందికి, ఆసుపత్రికి వచ్చి వెళ్లే ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పేద ప్రజలను ఆదుకోవడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంకే సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయాన్ని దర్శించుకున్న జడ్జి



నవతెలంగాణ-మనూర్

మండలంలోని బోరంచలో ప్రసిద్ధి గాంచిన నల్ల పోచమ్మ దేవాలయాన్ని మేడ్చల్ జడ్జి అర్జున్.. కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ప్రత్యేక దర్శనం చేయించారు. అనంతరం ఆయన్ను శాలువాతో సన్మానించి.. ప్రసాదం అందజేశారు. మనూర్ యస్ఐ ముడ్ అంబ్రాయ్, దేవాలయం సిబ్బంది ఘన స్వాగతం పలికారు.



పెండ్లి వేడుకలో పాల్గొన్న ఎంపీ

నవతెలంగాణ-మనూర్

మండలంలోని మోగదుంపూర్ గ్రామానికి చెందిన నల్లోల మొగులయ్య కుమారుడి వివాహం సోమవారం జరిగింది. ఆ వివాహ వేడుకలో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ శెట్కార్ పాల్గొని.. నూతన వధూవరులను ఆశర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట రేగోడ్ జెడ్పీటీసీ యాదగిరి, నాయకులు రషీద్, సుభాష్ పాటిల్, రవి తదితరులు పాల్గొన్నారు.



మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-న్యాల్‌కల్

కల్‌బేమల్ మాజీ సర్పంచ్ మహిపాల్ నానమ్మ మృతి చెందింది. ఈ విషయం తెల్సుకున్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు సోమవారం రోజున మృతురాలి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి.. ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబానికి అండంగా ఉంటామన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ మహిపాల్, సంజీవ్, వినోద్, కార్యకర్తలు ఉన్నారు.



కట్టు కాలువను కబ్జా!

నవతెలంగాణ-హత్నూర

మండలంలోని ముచ్చర్ల గ్రామానికి చెందిన పెద్దచెరువు కట్టు కాలువను ఎస్సీఎల్ వేకా పరిశ్రమ యాజమాన్యం చెత్తా చెదారం నింపి చెరువులోకి నీరు రాకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎస్సీఎల్ వెకా, సెక్కోలార్ యాజమాన్యాలు మెయిన్‌రోడ్డు కల్వెట్ పైపులను చెత్త తో నింపడమే కాకుండా వెక పరిశ్రమ లోపల కాల్వను కబ్జాచేసి పూడికను నింపే సిందని ఆరోపించారు. ఈ విషయమై యాజమాన్యానికి ఇంతకు ముందే పలుసార్లు చెప్పినా స్పందించడం లేదన్నారు. వర్షాలు ప్రారంభమై నెల దాటు తున్న కట్టు కాలువ కనిపించకపోవడం గమనార్హమన్నారు. అటు ఎస్‌సీఎల్ వేక మరియు సె క్కోలార్ యాజమాన్యాలు చిన్ననీటి పారుదల శాఖ అధికారులు ఈ విషయమై దృ ష్టి పెట్టకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా వెంటనే స్పందించి వేకా పరిశ్రమలోని కట్టు కాలువ పూడికతీసి,మెయిన్ రోడ్‌వద్ద ఉన్న చెత్తచెదారాన్ని తొలగించి ముచర్ల పెద్దచెరువులోకి నీళ్ల వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈనెల 19న తెలంగాణ ఉద్యమకారుల సమావేశం



నవతెలంగాణ-సంగారెడ్డి

ఈనెల 19 న ఉదయం పది గంటలకు జిల్లా పరిషత్ పాత సమావేశ మందిరంలో తెలంగాణ ఉద్యమకారులు సమావేశం నిర్వహి స్తున్నట్టు తెలంగాణ జన సమితి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యాక్రమానికి తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వై. అశోక్ కుమార్ లు ముఖ్య అతిథిలుగా హాజరుకానున్నారు. కాబట్టి తెలంగాణ తొలిదశ , మలిదశ ఉద్యమకారులు జేఏసీ నాయకులు సకాలంలో ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.



ఎలక్షన్ డ్యూటీ డబ్బులు చెల్లించాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ఎలక్షన్ సమయంలో డ్యూటీ చేసిన ఆశా మరియు మున్సిపల్ వర్కర్లకు డ్యూటీ డబ్బులు చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఖేడ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ నాయకులు నల్లవల్లి రమేష్ మాట్లాడుతూ.. ఎలక్షన్ సమయంలో ఆశా మరియు మున్సిపల్ కార్మికులు డ్యూటీ చేసినా.. అలాంటిది వా రికి డ్యూటీ డబ్బులు చెల్లించకపోవడం దారుణమన్నారు. జిహెచ్ఎంసీ పరిధిలో పనిచేసిన కార్మికులకు ఎలక్షన్ డ్యూటీ డబ్బులు చెల్లించారన్నారు. కానీ మున్సిపల్ పరిధిలో పనిచేసిన కార్మికులకు డ్యూటీ డబ్బులు ఎందుకు చెల్లించ లేదని సమా ధానం ఇవ్వాలన్నారు. తక్కువ జీతాలతో కుటుంబం గడిచే పరిస్థితి లేదని.. అయి నా వారికి ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభు త్వ ఉన్నతాధి కారులు వెంటనే ఎలక్షన్ టైంలో డ్యూటీలు చేసిన వారికి డబ్బులు చెల్లించాలన్నారు. లేని యెడల సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు సతీష్, పవన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



వ్యర్థ పదార్థాలు రోడ్లమీద పడేయకుండా కవర్ల పంపిణీ

నవతెలంగాణ-కోహిర్

వ్యర్థ పదార్థాలు పడేయకుండా కవర్‌లో వేయాలని కోహిర్ ఎంపీటీసీ-4 ప్రతినిధి సవుద్ శహెద్ తన సొంత ఖర్చులతో పాలిథిన్ కవర్ల ను పంచారు. ముస్లింల పవిత్ర బక్రీద్ పర్వదినం సందర్భంగా ఖుర్బానీ ఇచ్చిన అనంతరం దానిలోని వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఒక పాలి థిన్‌లో కవర్‌లో వేయాలని.. వాటిని పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ వ్యర్థ పద ర్థాలతో పంచాయతీ సిబ్బంది ఇబ్బందులు పడొద్దని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. గ్రామస్తులు కూడా సహకరించి వ్యర్థలను కవర్‌లోనే వేశారన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

ఘనంగా వేడుకలు

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా సోమవారం రోజున బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు ఘనంగా జరిపారు. కొత్త బట్టలు ధరించి మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కులమతాలకు అతీతంగా హిందువులు సైతం అలైబలైతో ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పలు చోట్ల ఎంపీ, ఎమ్మెల్యేలు సైతం వేడుకల్లో పాల్గొని ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు చెప్పారు.



త్యాగానికి ప్రతీక బక్రీద్ పర్వదినం

నవతెలంగాణ-పటాన్‌చెరు

త్యాగానికి చిహ్నమైన బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరీ సోదరీమణులందరికీ పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పర్వదినం పురస్కరించుకొని తన నివా సంలో ఏర్పాటుచేసి కార్యక్రమంలో ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు చెప్పారు. ముస్లింలు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగలలో బక్రీద్ పండుగ ఒకటన్నారు. ఈ పండుగ త్యాగానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బక్రీద్ పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

పలు మండలాల్లో ఎంపీ పర్యటన



నవతెలంగాణ-న్యాల్‌కల్, కోహిర్

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని న్యాల్కల్, కోహిర్ మండలాల్లోని చాలా గ్రామాల్లో ఎంపీ సురేష్ షెట్కర్ పర్యటించారు. ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు చెబుతూ.. పలు మసీదుల్లో ప్రార్థనలు చేశారు.

న్యాల్కల్ మండలంలోని చాల్కి, హద్నూర్, రేజింతల్, ముంగి, మిర్జాపూర్(బి)తో పాటు పలు గ్రామాల్లో ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ఘనంగా జరిపారు. కాగా పండుగను పుస్కరించుకుని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రేజింతల్ గ్రామ మైనారిటీ నాయకులు ఎంపీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, పీఏసీఎస్ చైర్మెన్ ఇంటికి వెళ్లి మైనార్టీ సోదరులను సోదరులను కలిశారు. కార్యకర్తలను ఆప్యాయతగా పలకరించారు. మండలంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు కోసం తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు.వారి వెంట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్తపల్లి భాస్కర్ రెడ్డి, న్యాల్కల్ సిద్ధిలింగయ్య స్వామి, అత్నూర్ రఫీయేద్దిన్, మరియంపూర్ కాశీనాథ్, మైనార్టీ సోదరులు ఉన్నారు.



కోహిర్ మండలంలోని వైస్ ఎంపీపీ చాకిరల్లి నివాసానికి మరియు మాజీ ఎంపీటీసీ వహీద్ నివాసానికి వెళ్లి బక్రీద్ శుభాకాంక్షలను ఎంపీ తెలిపారు. భక్తిని, త్యాగ గుణాన్ని బక్రీద్ పండుగ చాటి చెప్తుందని తెలిపారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు వెరవకుండా, దేవుని పై విశ్వాసాన్ని కలిగి, సన్మార్గంలో జీవనాన్ని సాగించాలనే గొప్ప సందేశాన్ని బక్రీద్ పండుగ మానవాళికి ఇస్తున్నదన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ షౌకత్‌అలీ, వైస్ ఎంపీపీ షాకిర్ అలీ, మాజీ ఎంపీటీసీ వహీద్ హాజీ పటేల్, మాజీ సర్పంచ్ జావిద్ జలీల్, మాజీ ఉపసర్పంచ్ మోసిన్, మతిన్, మన్నాన్, ఇస్మాయిల్, నర్సింలు, రిపోర్టర్ జయదలి, కాంగ్రెస్ నాయకులు, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-రామచంద్రాపురం

త్యాగం, భక్తి విశ్వాసానికి ప్రతీక అయినా బక్రీద్ పండుగను రామచంద్రపురం భారతినగర్ తెల్లాపూర్ మున్సిపాల్టీలోని గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన సమైక్యతను,సోదరా భావాన్ని అందరూ అనుసరించాలని ఈ సందర్భంగా రామచం ద్రాపురం, భారతినగర్ కార్పొరేటర్లు పుష్ప, సింధు మరియు తెల్లాపూర్ మున్సిపాల్టీ చైర్మెన్ లలిత సోమిరెడ్డి ప్రజలను కోరారు. ఉదయాన్నే ఈద్గా వద్ద నమాజ్ కాగానే నాయ కులు, హిందువులు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేసి వారితో మమేకమై బక్రీద్ వేడుకల్లో పాల్గొన్నారు.

న్యాల్‌కల్ : త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అని.. దైవ ప్రవక్త ఇబ్రాహీం మహోన్నత త్యాగస్ఫూర్తిని స్మరించు కుంటూ ముస్లిం సోదరుల పండుగను ఘనంగా జరుపు కున్నారని మల్గి మాజీ సర్పంచ్ జట్గొండ మారుతి, పలువురు నాయకులు అన్నారు. ఈ సందర్భంగా గ్రామ ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో మైనారిటీ నాయకులు అఖిల్‌మియా తదితరులు పాల్గొన్నారు.

కోహిర్ : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. త్యాగ్యానికి ప్రతీక అయిన బక్రీదు సందర్భంగా దైవప్రవక్త ఇబ్రహీం స్ఫూర్తిని స్మరించుకుంటూ మసీదుల వద్ద ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు పలాయ్ బలాయ్ తీసుకొని శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

జిన్నారం : మండల పరిధిలోని శివానగర్, కాజిపల్లి, నర్రిగూడ ,సోలక్పల్లి, జిన్నారం గడ్డపోతారం, చెట్ల పోతారం, కిష్టయ్యపల్లి, అలీనగర్, వావిలాల, జంగంపేట మంగంపేట, లక్ష్మీపతి గూడెం, కొడకంచి మాదారం నల్తూర్ తదితర గ్రామాల్లో ముస్లిం సోదరులు బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈద్ ముబారక్ అంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు.

జోగిపేట : జోగిపేట మున్సిపాల్టీతోపాటు ఆయా గ్రామాలలో ముస్లిం సోదరులు సమీపంలోని మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మున్సిపల్ పరిధిలోని18వ వార్డు కౌన్సిలర్ ఎస్. సురేందర్ గౌడ్, 17వార్డు కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబులు ప్రత్యేకంగా ముస్లిం కాలనీలో పండగ శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు, మైనార్టీ సోదరులకు ఈద్ ముబారక్ తెలియజేశారు.

పుల్కల్ : పుల్కల్ ఉమ్మడి మండలంలో బక్రీద్ పండుగను అంగరంగ వైభవంగా జరిపారు. త్యాగానికి ప్రతిక అయిన బక్రీద్ రోజున ముస్లిం మైనార్టీ సోదరులు ఉదయాన్నే కుటుంబ సమేతంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఒకరికి ఒకరు అలింగణం చేసుకున్నారు శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేశారు.










అత్యవసర సమయంలో రక్తదానం

మానవత్వం చాటుకున్నా రంగు రాజు గౌడ్



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డిలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణికి సోమవారం అత్యవసరంగా ఏ పాజిటివ్ రక్త అవసరం కాగా.. రంగు రాజు గౌడ్ వెంటనే స్పందించి రక్తదానం చేసి మానవత్వం చాటాడు. సంగారెడ్డి పట్టణానికి చెందిన గర్భిణి డెలివరీ కోసం ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేరింది. అయితే ఆమెకు ఆపరేషన్ చేసేది ఉండగా.. రక్తం తక్కువగా ఉండడంతో ఏ పాజిటివ్ బ్లడ్ అర్జంటెగా కావాలని ఆమె కుటుంబ సభ్యులకు తెలిపారు. దాంతో కుటుంబ సభ్యులు అబ్బాస్, అబ్దుల్ సమద్ బ్లడ్ డోనార్స్ క్లబ్ అధ్యక్షుడు బంగారు కృష్ణను ఫోన్ ద్వారా సంప్రదించారు. బంగారు కృష్ణ వెంటనే సంగారెడ్డి మున్సిపాల్టీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న రంగు రాజు గౌడ్‌కు విషయం తెలిపాడు. దాంతో ఆయన వెంటనే స్పందించి.. తాను రక్త దానం చేస్తానని ముందుకు వచ్చాడు. వెంటనే బాలాజీ బ్లడ్ బ్యాంకు కు చేరుకొని ఏ పాజిటివ్ బ్లడ్ గ్రూప్ దానం చేసి మానవత్వం చాటుకున్నాడు. ఈ సందర్భంగా బ్లడ్ డోనార్స్ క్లబ్ అధ్యక్షుడు బంగారు కృష్ణ మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. చాలా మంది రక్త దానం చేయడానికి బయపడుతారు.. కానీ రక్త దానం చేయడం వల్లశారీరంలో కొత్త రక్తం చేరి మరింత ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆరోగ్యంగా ఉన్నా ప్రతీ ఒక్కరు సమాజిక బాధ్యతగా రక్త దానం చేసి ప్రాణ దాతలుగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా రక్త దాత రంగు రాజు గౌడ్ మాట్లాడుతూ.. తాను రక్త దానం చేయడం మూడోసారి అన్నారు. ఆరోగ్యంగా ప్రతీ ఒక్కరు మూడు నెలలకు ఒక్కసారి రక్త దానం చేసి ప్రాణ దాతలుగా నిలవాలన్నారు. అనంతరం రక్త దాత రంగు రాజు గౌడ్‌కి బంగారు కృష్ణ, అబ్దుల్ సమద్, ప్రకాష్ రెడ్డి ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు అబ్బాస్, అబ్దుల్ సమద్ రాజు గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎలక్ట్రానిక్ షాప్ ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు సార శ్రీధర్ నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ దుకాణాన్ని సోమవారం ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా షాపులో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలు జీవనోపాధి మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన్ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం జోగిపేట పట్టణ మైనార్టీ సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మెన్ డిబి. నాగభూషణం, మాజీ పట్టణ అధ్యక్షులు వెంకటేశం, నాయకులు కాజా పాషా, సంతోష్, బాబా, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



నవతెలంగాణ-జోగిపేట

ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆందోల్ మండల పరిధిలోని అన్నసగర్ గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. జోగిపేట ఎస్సై అరుణ్ కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. జూకల్ ప్రాంతానికి చెందిన పండరి(40) అనే వ్యక్తి ట్రాక్టర్ పనులు చేసే నిమిత్తం అందోల్ మండలానికి జీవన ఉపాధి కోసం వచ్చాడు. ట్రాక్టర్ పనులు చేసేందుకు డీజిల్ అవసరముం డడంతో టీవీఎస్ ఎక్సెల్‌పై జోగిపేటకు వచ్చి డబ్బాలో డీజిల్ నింపుకొని వెళుతుండగా నారాయణఖేడ్ నుంచి లింగంపల్లి వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు మండల పరిధిలోని అన్నాసాగర్ వద్ద ఢీ కొట్టింది. దీంతో టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జోగిపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టు మార్టం చేయించారు. ఆర్టీసీ బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్సై తెలిపారు.

జిన్నారంలో ఉచిత వైద్య పరీక్షలు



నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో సోమవారం హైదరాబాద్లోని జగద్గిరి గుట్ట ప్రాంతానికి చెందిన పద్మజ హాస్పటల్ అద్వర్యం లో ఉచిత వైద్య శిభిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన వివిధ గ్రామాలకు సంబంధించిన వారికి వైద్య బృందం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో ఎముకల,నరాల,చిన్న పిల్లల స్త్రీల సంబంధిత, వివిధ సాధారణ వైద్య సంబంధిత అంశాలకు సంబంధించి వైద్య బృందం పాల్గొని శిబిరానికి హాజరైన వారికి ప్రత్యేకంగా పరీక్షలు చేపట్టారు . వైద్య సంబంధిత సలహాలు సూచనలు అందజేశారు . ఈ కార్యక్రమంలో వైద్య బృందం స్థానికులు, నాయకులు హాజరయ్యారు.

మెదక్‌లో జరిగిన అల్లర్లకు నిరసనగా వెల్దుర్తి బంద్



నవతెలంగాణ-వెల్దుర్తి

మెదక్‌లో శనివారం జరిగిన అల్లర్లకు నిరసనగా సోమవారం బీజేపీ, బీజెవైఎం విహెచ్పి బజరంగ్దళ్ ఆదేశాల మేరకు సోమవారం వెల్దుర్తి పట్టణం వ్యాపార సంస్థలు బంధు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నర్సింలు ఎల్లం శ్రీనివాస్, నవీన్ శేఖర్ గౌడ్, విక్రమ్ సింగ్, మహేష్ రాజు, వినయ్ కృష్ణ ఆధ్వర్యంలో పాల్గొని మాట్లాడారు. గోవధ నిషేధ చట్టం సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ మెదక్ పట్టణంలో గోవధ చేస్తున్నారని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కొంతమంది అకారణంగా దాడికి దిగడం జరిగిందన్నారు. అకారణంగా దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. హిందువుల ఆరాధ్య దైవమైన గోమాతను సంహరించడం సరికాదన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో తలారి వెంకట్, వడ్ల లక్ష్మి ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం రెండు కుటుంబాలను పరమర్శించారు. దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలకు 50 కేజీల చొప్పున రెండు కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వడ్ల నవీన్ కుమార్, యువ నాయకులు సంద్రుగు శ్రీకాంత్, గణేష్, కనకరాజు, మహేష్, మధు, సాయి, శ్రీమన్, తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 18 న సర్వ సభ్య సమావేశం

నవతెలంగాణ-తూప్రాన్

ఈ నెల 18 న తూప్రాన్ మండల సర్వసభ్య సమావేశంలి మంగళవారం రోజున తూప్రాన్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సాధారణ సర్వ సభ్య సమావేశం ఎంపిపి గడ్డి స్వప్న వెంకటేష్ యాదవ్ అధ్యక్షతన జరుగును. ఈ సమావేశానికి ఎంపిటిసిలు,ప్రత్యేక అధికారులు,అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని తూప్రాన్ మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

తూప్రాన్ బంద్ విజయవంతం



నవతెలంగాణ-తూప్రాన్

బీజేపీ ఆధ్వర్యంలో తూప్రాన్ బంద్ విజయవంతం బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టులు భారతీయ అంతా పార్టీ మెదక్ జిల్లా బందు పిలుపు మేరకు తూప్రాన్ మున్సిపల్ బందు నిర్వహించడం జరిగింది. మున్సిపల్ శాఖ అధ్యక్షులు భూమన్న గారి జానకిరామ్ గౌడ్ ఆధ్వర్యంలో పోతురాజు పల్లి నుంచి నర్సాపూర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించి బందు నిర్వహించారు అనంతరం తూప్రాన్ పోలీసులు బీజేపీ నాయకులను బంధు నిర్వహించవద్దని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు వ్యాపారస్తులు దుకాణదారులు స్కూల్లు పెట్రోల్ బంకులు స్వచ్ఛందంగా బంధు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరసింహారెడ్డి, గట్టు అమర్ గుప్తా, పోతరాజు శరత్, తూప్రాన్ మున్సిపల్ శాఖ ఉపాధ్యక్షుడు పోతరాజు నాగరాజు, ఆడెపు మధుసూదన్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు మన్నె సాయి ముదిరాజ్ మాసాయిపేట సురేష్ గౌడ్, సంపత్ గౌడ్, వినయ్, జె.మధు, సిద్ధిరాములు, చ్.మల్లేష్, పృథ్వీ గౌడ్, రాకేష్, మహేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలప్పుడు డబ్బులివ్వలేదని పంజా విజయ్ ఆరోపణలు

- బీజేపీది మత రాజకీయాల చరిత్ర

కాంగ్రెస్ మండల నాయకులు వెంకుగారి శ్రీధర్ రెడ్డి

నవతెలంగాణ-రామాయంపేటఫ ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో బీజేపీ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీలో ఉన్న పంజా విజయ్, కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తానని డబ్బులు డిమాండ్ చేయగా, మైనంపల్లి రోహిత్ రావ్ నిరాకరించాడనే కోపంలో వ్యక్తిగత కక్షతో ఆరోపణలు చేస్తున్నాడని, కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు వెంకుగారి శ్రీధర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎన్నికలప్పుడు రూపాయలు. మూడు కోట్ల మైనంపల్లిని, పంజా విజయ్ డిమాండ్ చేయగా, తనకు ప్రజలు మద్దతు ఉన్నదని లేదని రోహిత్ రావ్ తెలిపారన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో గొడవలు చెలరేగడానికి ఎమ్మెల్యే మైనపల్లి రోహిత్ రావ్ కారణమనడం హాస్యాస్పదం అన్నారు. మతాలను అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేసే చరిత్ర బీజేపీదని ఎద్దేవా చేశారు. నిన్నగాక మొన్న ఎంపీగా గెలిచారో లేదో అప్పుడే మతాల మధ్య గొడవలు సృష్టిస్తున్నారని ఆయన ఆరోపిం చారు. మరొకసారి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పై వ్యక్తిగత కక్షలతో ఆరోప ణలు చేసిన, అనుచిత వ్యాఖ్యలు చేసిన నియోజకవర్గంలో తిరగనిచ్చేది హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు రమేష్ చారి, ఎనిషెట్టి అశోక్, భూమ రమేష్, శీలం సాకేత్ రెడ్డి, పుట్టి అఖిల్ తోపాటు పలువురు ఉన్నారు.

బక్రీద్ సందర్భంగా బీడీ కార్మికులకు సెలవు ఇవ్వరా..?



నవతెలంగాణ-నిజాంపేట

బీడీ కార్మికులు నిత్యం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం ఏడు గంటల వరకు బీడీలు చేస్తూనే ఉంటారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బక్రీద్ పండగకు ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వ సంస్థలకు సెలవు ప్రకటించినప్పటికీ కొన్ని ప్రైవేటు సంస్థలు పనులు చేయిస్తున్నారు. మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని నందిగామ, నిజాంపేట గ్రామాలలోని దేశాయి బీడీ కంపెనీ , లంగర్ బీడీ, చారు బాయ్ ,లాంటి బీడీ పరిశ్రమలు పండగ రోజు కూడా పనులు కొనసాగిస్తూనే ఉన్నారు. కార్మిక శాఖ మాత్రం పట్టించుకోవడంలేదని కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీడీ కంపెనీలలో వందలకొద్ది కార్మికులు పనిచేస్తున్నారని బీడీ కంపెనీ యాజమాన్యాలు కార్మికులకు తక్కువ వేతనాలు ఇస్తూ పనులు చేయించుకుంటున్నారు. ఆదివారం లేబర్ హాలిడే అయినప్పటికీ ఎప్పటిలాగే యధావిధిగా పనులు చేయిస్తున్నారు . సంబంధిత అధికారులు స్పందించి వెంటనే బీడీ కంపెనీ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కర్బుజ కాయ మీద బక్రీద్ చిత్రం

- అద్భుతంగా చిత్రించిన రామకోటి రామరాజు



నవతెలంగాణ-గజ్వేల్

బక్రీద్ పండుగ సందర్భంగా కర్బుజ కాయ మీద బక్రీద్ చిత్రం మజీద, నమాజ్ చేసే ఇమామ్ చిత్రాలను అద్భుతంగా చిత్రించి అందరి అభినందనలు అందుకున్నారు. శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు, రాష్ట్రస్థాయి కళారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు చిత్రీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత దేశంలో ఉన్న హిందూ ముస్లింలు అందరూ కూడా సోదరా సమానంగా మెలగాలన్నారు. భారతదేశ ఐక్యతను చాటాలన్నారు. బిన్నత్వంలో ఏకత్వం మనదేశ సంస్కృతి అన్నారు.

మృతుని కుటుంబానికి పది వేల అర్థిక సహాయం



నవతెలంగాణ-నంగునూరు

ఇటీవల మృతి చెందిన గౌరబోయిన యాదయ్య కుటుంబాన్ని ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సూర్య వర్మ కాంగ్రెస్ సీనియర్ నాయకులు తాడూరి శ్రీనివాస్ గౌడ్ వేర్వేరుగా పరామర్శించి చెరో ఐదు వేల అర్థిక సహాయాన్ని అందించారు. నంగునూరు మండల కేంద్రంలో ఈ నెల 8న గౌరబోయిన యాదయ్య మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం మృతుని కుమారుడైన గౌరబోయిన సంపత్ కుమార్‌ను కాంగ్రెస్ నాయకులు పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షులు అనరాజు నాగరాజు, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ చెలికాని యాదగిరి యాదవ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రాగుల కృష్ణ, మండల ఉపాధ్యక్షులు శివప్రసాద్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు చింతల నవీన్, ఉల్లి హరీష్ యాదవ్, గౌరబోయిన వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ

నవతెలంగాణ-వెల్దుర్తి

ప్రతి ఏటా ముస్లిం సోదరులు నిర్వహించుకునే పండుగలు బక్రీద్ పండుగ ఈ పండుగ త్యాగానికి సహనానికి ప్రతీకగా వచ్చిన పండుగను భక్తిశ్రద్ధలతో సోమవారం ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. ముస్లింల మత పెద్ద అయిన గురువు ఆధ్వర్యంలో మసీదుల్లో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్యాగానికి గుర్తుగా బక్రీద్ పండుగను జరుపుకున్నారు.

నవతెలంగాణ-తూప్రాన్

దాన గుణానికి నిదర్శనం బక్రీద్ తూప్రాన్ మండల కేంద్రములో ఈద్గావద్ద, ఈద్-ఉల్-అదా, బక్రీద్ పండగ ఘనంగా నిర్వహించుకున్నారు, త్యాగానికి ప్రతీక, త్యాగ గుణాన్ని చాటిచెబుతుంది. స్వార్థం, అసూయ, రాగద్వేషాలు లేని త్యాగనిరతిని వ్యాపింపచేయడమే బక్రీద్ పండుగ ముఖ్యఉద్దేశం. అన్ని గుణాల కన్నా దానగుణమే ఉత్తమమన్నది బక్రీద్ సారాంశం. హజ్రత్ ఇబ్రహీం త్యాగ నిరతిని స్మరించుకుంటూ బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు, అల్లహ్ అనుగ్రహం మన అందరిపైనా ఉండాలని కోరుకుంటూ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు ఒకరికొకరు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మైనారిటీ సోదరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నిజాంపేట

బక్రీదు పండగ సందర్భంగా మండల కేంద్రంలోని ఈద్గా వద్ద ముస్లింలు సోమవారం ప్రార్థనలు చేశారు. శాంతి సౌభ్రాతృత్వానికి దానధర్మాలకు బక్రీదు పండగను జరుపుకుంటారని ముస్లిం సోదరులు తెలిపారు. అందర్నీ చల్లగా చూడాలని అల్లాను కోరుకున్నామని ముస్లిం సోదరులు తెలిపారు. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా అందరూ హలైబాలై తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనాబ్, తలహ, అబ్దుల్, అజ్గర్, మైనుద్దీన్, ఇక్బాల్ , నసీరుద్దీన్, ఇబ్రహీం, బాబు మియా రబ్బు, పాషా, నూర్ భాషా అధ్యక్షులు అబ్దుల్, షాదుల్, తదితరులు పాల్గొన్నారు.



నవతెలగాణ-మాసాయిపేట

మాసాయిపేట మండలం పోతాన్ పల్లి గ్రామంలోని ఈద్గా వద్ద, ఈద్-ఉల్-అదా, బక్రీద్ పండగ ఘనంగా నిర్వహించుకున్నారు, త్యాగానికి ప్రతీక, త్యాగ గుణాన్ని చాటిచెబుతుంది. స్వార్థం, అసూయ, రాగద్వేషాలు లేని త్యాగనిరతిని వ్యాపింపచేయడమే బక్రీద్ పండుగ ముఖ్యఉద్దేశం. అన్ని గుణాల కన్నా దానగుణమే ఉత్తమమన్నది బక్రీద్ సారాంశం. హజ్రత్ ఇబ్రహీం త్యాగ నిరతిని స్మరించుకుంటూ బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు, అల్లహ్ అనుగ్రహం మన అందరిపైనా ఉండాలని కోరుకుంటూ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు, ఈ కార్యక్రమంలో మౌలానా అబ్దుల్ మన్నాన్, మాజీ అడవి చైర్మన్ మహమూద్ అలీ, చేగుంట మండల్ కో-ఆప్షన్ మెంబర్ మహమ్మద్ అలీ, అహ్మద్ అలీ, మహబూబ్ అలీ, సాహెబ్ అలీ, జాహీద్ అలీ, గౌస్, సాహెబ్, సద్దాం, ఆరిఫ్, రఫీక్, షాదుల్, ఇర్ఫాన్, అజ్గర్ అలీ, జాఫర్ అలి, యూసుఫ్, అస్లం, షౌకత్, దావూద్, మైనారిటీ సోదరులు పాల్గొన్నారు.







అల్లరుమూఖలు సృష్టించిన విధ్వంసం బాధాకరం



- గాయపడిన ఇరువర్గాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది
- శాంతిభద్రతల విషయంలో పోలీసుల సేవలు బేష్
- మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్సిపల్ చైర్మెన్ చంద్రపాల్

నవతెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ పట్టణంలోని శనివారం రాత్రి కొందరు అల్లరుమూఖలు సృష్టించిన విధ్వంసం బాధాకరం అని మతసామరస్యానికి ప్రతీక అయిన మెతుకుసీమలో ఇలాంటి ఘటనలు జరడం దురదృష్టకరం అని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ చైర్మెన్ తొడుపునూరి చంద్రపాల్ అన్నారు. మెదక్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ షమీ, మందుగుల గంగాధర్, హన్మంతు, బానీ, జీవన్ రావులు పాల్గోన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో కొందరి స్వార్థ రాజకీయాల కోసం అల్లరుమూఖలు గొడవలు సృష్టించారని వారన్నారు. ఈ గొడవల్లో గాయపడ్డ ఇరువర్గాలకు సంబంధించిన వారికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలబడుతుందని వారన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు మైనంపల్లి హన్మంతరావు తో పాటు నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌లు, ఎప్పటికప్పుడు పోలీసులతో మరియు ఇక్కడ ఉన్న స్థానిక నాయకులతో సమాచారం తీసుకుంటూ పోలీసులకు సూచనలు జారీ చేస్తూ అత్యంత తక్కువ సమయంలోని గొడవలు లేకుండా పోలీసులు అందించిన సేవలు బేష్ అని వారు తెలిపారు. అల్లరుమూఖలు సృష్టించిన గొడవల్లో పోలీసులు నిస్పక్షపాతంగా వహిస్తున్నారన్నారు. ఎవరినైనా, ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, పోలీసులు ఏ పార్టీకి పనిచేయదని వారు స్పష్టం చేశారు. మెదక్ అంటేనే మతసామరస్యాలకు ప్రతీకగా నిలిచిన మెదక్ పట్టణంలో ఇలాంటి గొడవలు జరగడం దురదృష్టకరం అని వారన్నారు. ఏది ఏమైనా యువత మీ తల్లిదండ్రులను దృష్టిలో పెట్టుకోని నడుచుకోవాలని సూచించారు.

ఎల్లమ్మ జమదగ్ని కళ్యాణ మహోత్సవానికి ఎంపీకి ఆహ్వానం



నవతెలంగాణ-రాయపోల్

రాయపోల్ మండల కేంద్రంలో జరుగుతున్నటువంటి శ్రీ రేణుక ఎల్లమ్మ-జమదగ్ని కళ్యాణ మహోత్సవానికి మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావును ఆహ్వానించడం జరిగిందని రాయపోల్ శక్తి కేంద్ర ఇన్చార్జ్ ఆహ్మదిపూర్ రాజు గౌడ్ తెలిపారు. సోమవారం ఎంపీ రఘునందన్ రావు నివాసంలో ఆహ్వాన పత్రిక అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయపోల్ మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నుంచి మంగళవారం వరకు మూడు రోజులు నిర్వహిస్తున్న రేణుక ఎల్లమ్మ జమదాగ్ని కళ్యాణ మహోత్సవానికి మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు పాల్గొనవలసిందిగా ఆహ్వాన పత్రిక ఆహ్వానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు భాగన్నగారి రవీందర్ రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షులు బాగన్నగారి సుఖేందర్ రెడ్డి, బిజెపి నాయకులు మాజీ సర్పంచ్ సింగర బోయిన స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ రఘునందన్ రావును విమర్శించే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదు



నవతెలంగాణ-ములుగు

ఎంపీ రఘునందన్ రావు విమర్శించే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని బీజేపీ నాయకులు లక్ష్మణ్ గౌడ్ అన్నారు ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు వంటిమామిడి మార్కెట్ మాజీ చైర్మన్ జాంగిర్ ఎంపీ రఘునందన్ రావు విమర్శించే హక్కు జాంగిర్‌కు లేదని వారి యొక్క స్థాయిని చూసి మాట్లాడాలని అన్నారు . ఈ కార్యక్రమంలో ములుగు మండల బీజేపీ అధ్యక్షులు మన్నె శ్రీనివాస్ జిల్లా ఉపాధ్యక్షులు రాములు ములుగు మండల ఉపాధ్యక్షులు కొండు నర్సింలు క్షీరసాగర్ మాజీ ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి బూత్ అధ్యక్షులు నల్ల నరేందర్ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు ఆదాసు మహేష్ పాల్గొన్నారు.

సామాజిక సమరసతా వేదిక

- తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడుగా
- డాక్టర్ ఆకుల నరేశ్ బాబు ఎంపిక



నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ రాష్ట్ర సామాజిక సమర సత వేదిక అనుబంధ కార్యాలయం, హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర సమావేశంలో డా.ఆకుల నరేశ్ బాబును సామాజిక సమరసతా వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా డా.నరేశ్ బాబు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ గురుతర బాధ్యత అప్పగించినందుకు సామాజిక సమరసతా వేదిక అఖిల భారత కన్వీనర్ శ్రీ శ్యాం ప్రసాద్‌కి, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ శ్రీ అప్పాల ప్రసాద్, రాష్ట్ర ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను నెరవేర్చడానికి తన శక్తి మేరకు కృషి చేస్తానని తెలిపారు.

నిజాంపేటలో బంద్...



- దుకాణాలను బందు చేయించిన బీజేపీ నాయకులు



నవతెలంగాణ-నిజాంపేట

మెదక్ పట్టణంలో జరిగిన హిందూ ముస్లిం గొడవ ను నిరసిస్తూ, సోమవారం నిజాంపేట మండల కేంద్రంలో బిజెపి ,బజరంగ్ దళ్ ,విశ్వహిందూ పరిషత్ నాయకుల ఆధ్వర్యంలో వ్యాపార, వాణిజ్య సంస్థలను చిన్నచిన్న దుకాణాలను కూడా బంద్ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ మెదక్ పట్టణంలో గోవులను కాపాడేందుకు వెళ్లిన క్రమంలో విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్,బిజెపి కార్యకర్తల పై ముస్లిం సోదరులు రాళ్లతో, కత్తితో దాడి చేయడం జరిగింది. దీనికి నిరసనగా మెదక్ పట్టణంలో వివిధ హిందూ సంఘాలు ధర్నా, నిరసన చేసినందుకు వీరి పైన ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి రిమాండ్కు పంపించడం జరిగింది. దానికి నిరసనగా సోమవారం మండల కేంద్రంలో బిజెపి, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, వివిధ హిందూ క్షేత్రాల ఆధ్వర్యంలో మెదక్ జిల్లా బందుకు పిలుపు ఇవ్వడం జరిగింది. దీనిలో భాగంగా మండల కేంద్రంలో, వివిధ హిందూ క్షేత్రాల ఆధ్వర్యంలో బందుకు పిలుపునిచ్చిన తరుణంలో. వ్యాపార వాణిజ్య సంస్థలు బంధు చేసినందుకు కృతజ్ఞతలు అన్నారు. మెదక్ పట్టణంలో ఎలాంటి సంఘటనలు జరిగిన అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమలో వివిధ హిందూ సంఘాల నాయకులు బిజెపి ప్రధాన కార్యదర్శి మహంకాళి నరేష్, భజరంగ్ దళ్, స%శీ%యోజక్ తిరుపతి, మెకానిక్ రాజిరెడ్డి, బక్కోళ్ల కుమార్, పప్పుల సిద్ధిరాం రెడ్డి, ఆముద రాజు, పంజా బాబు, రేగుల కుమార్ తదితరులు పాల్గొన్నారు

కనకయ్యకు ఘనంగా ఉద్యోగ విరమణ వీడ్కోలు



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న గౌటే కనకయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని మిలాన్ గార్డెన్‌లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. సిద్దిపేట అర్బన్, రూరల్ మండలాలోని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, అందరు కనకయ్య దంపతులను ఘనంగా సన్మానించి ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలాని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏసీజీఈ లక్ష్మయ్య, అంకిరెడ్డిపల్లె పీజీ హెచ్ఎం గోపాల్ రెడ్డి, మిట్టపల్లి పీజీ ఎచ్ఎం బాల ప్రసాద్, కొండపాక పీజీ ఎచ్ఎం సముద్రాల శ్రీనివాస్, టీచర్స్ ఫెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అన్నమా రెడ్డి, మిట్టపల్లి ఉపాధ్యాయూరాలు విజయ లక్ష్మీ, ఉపాధ్యాయులు నర్సింలు, లక్ష్మీ నరసింహ టీఎస్టీఓ జిల్లా అధ్యక్షుడు గ్యదారి పరమేశ్వర్, కార్యదర్శి విక్రమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వాభి మాన్ పతంజలి యోగ సమితి

- జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట జిల్లా భారత్ స్వాభి మాన్ ట్రస్ట్, పతంజలి యోగ సమితి, యువభారత్ నూతన కార్యవర్గాలను సోమవారం రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ రావు, ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్‌లు ప్రకటించారు. బీఎస్‌టి జిల్లా ప్రబారిగా తోట అశోక్, సహ ప్రభరీలుగా డాక్టర్ సాయి, కల్లపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రాములు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నర్సింలు, కోశాధికారిగా శశికిరణ్‌లను నియమించారు. పతంజలి యోగ సమితి చీఫ్ పాట్రన్‌గా అయితా అంజయ్య, జిల్లా ప్రభరిగా సురేష్ కుమార్, సహ ప్రభారీలుగా స్వామి, శ్రీనివాస్ రెడ్డిలను నియమించారు. యువ భారత్ జిల్లా చీఫ్ పాట్రన్‌గా నవీన్, జిల్లా ప్రబారిగా కిషన్, సహా ప్రభరీలుగా వేణు, రాజేష్ ఖన్నాలు ఎంపికయ్యారు. జిల్లా కిసాన్ సేవా సమితి అధ్యక్షులుగా నాగరాజ్, లీగల్ సెల్ అధ్యక్షులుగా శివాజీ గణేష్, యోగ సందేశ్ జిల్లా అధ్యక్షులుగా విజయలక్ష్మి, జిల్లా యోగా విస్తారక్‌గా గోపాలకృష్ణ, జిల్లా సంవాద్ ప్రభరిగా నాగభూషణం, జిల్లా ఆఫీస్ ప్రభరీగా మహిపాల్ రెడ్డి, సోషల్ మీడియా ప్రబారిగా మనోహర్‌లను నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. సిద్దిపేట జిల్లాలో యోగ విద్యను మారుమూల ప్రాంతాలకు తీసుకువెళ్లాలని ఈ సందర్భంగా వారు సూచించారు.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE MEDAK DIST. AT: MEDAK
O.S.NO. 151 OF 2024

Between:
Avanacha @ PattolaBakkappa
.........Plaintiff
AND
DudagondaSangameshwar& another
..........Defendants

To,
To Whomsoever it may Concern.
.............(Defendant No. 2)

Whereas the plaintiff have filed the above suit for Declaration to Declare the Plaintiff's As Legal Heirs Of Late (PalollaPunyavathi S/o. Late PatlollaChennappa) against you vide. O.S.No.151 of 2024. You are hereby summoned to appear in this court, in person or by a pleader on 05-07-2024 at 10:30A.M.,Including answer the same, failing which the matter will be decided ex-parte.

(BY ORDER OF THE COURT)
Middhinti Srinivas
(Advocate)
Sangareddy District

మారతాన్ గోడ పత్రిక ఆవిష్కరించిన కలెక్టర్



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రస్తుత సమాజంలో ఒత్తిడితో కూడిన ఉరుకుల పరుగుల మానవ జీవితంలో శారీరక, మానసిక వికాసానికి నడక, రన్నింగ్, వ్యాయామం ఎంతో మేలు చేస్తాయని జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ గరీమ అగర్వాల్ సిద్దిపేట రెండవ ఎడిషన్ హాఫ్ మారథాన్ గోడపత్రిక ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ఉదయం పూట అరగంట నుంచి గంటపాటు శారీరక శ్రమ చేయాలని సూచించారు. కరోనా ప్రభావ పరిస్థితుల అనంతరము చాలా మంది అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని, అనారోగ్య సమస్యలను ఎదుర్కొనేందుకు వ్యాయామం ఎంతో తోడ్పడుతుందని అన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ఉదయం పూట శారీరక వ్యాయామాలు చేయాలని సూచించారు. వచ్చే నెల 28న సిద్దిపేటలో జరిగే రెండవ ఎడిషన్ హఫ్ మారతాన్‌లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాపురెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కత్తుల బాపురెడ్డి, పరంధాములు, రాజు, వెంకట్, హరి, నర్సింలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడ్డ వారికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వండి



నవతెలంగాణ-సిద్దిపేట

పార్టీ కోసం కష్టపడ్డ వారికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ దీపదాస్ మున్షి కలిసి కోరినట్లు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ స్టేట్ సెక్రెటరీ గాడిపల్లి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దీపదాసు మున్షీని హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. తాను పార్టీ అధికారంలో ఉన్న, లేకున్నా పార్టీలో ఉన్నట్లు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తాను ఎల్లవేళలా కృషి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాల్ రెడ్డి, వెంకటరెడ్డి, కృష్ణ, సంతోష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పెన్షన్ మంజూరిలో అలసత్వం వహిస్తున్న ప్రభుత్వం

- ఎంపీటీసీ ఖమ్మం స్వరూప



నవతెలంగాణ-కోహెడ

కొత్త పెన్షన్ మంజూరిలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వహిస్తుందని ఎంపీటీసీ ఖమ్మం స్వరూప వెంకటేశం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ పెన్షన్ మంజూరి కాకపోవడంతో పలువురు లబ్దిదారులు ఇబ్బందులను ఎదుర్కోంటున్నారని, గత ప్రభుత్వం దాటవేత విధానాలే ఈ ప్రభుత్వం అనుసరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలో అర్హులైన వితంతువులు, వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు దరఖాస్తులు చేసుకొని సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్నప్పటికి గత ప్రభుత్వంలో నోచుకోకుండా నేటి కొత్త ప్రభుత్వంలోనైన పింఛన్ అందుతుందని భావించిన దరఖాస్తుదారులకు ఎదురుచూడడం తప్పడం లేదన్నారు. కొత్త పెన్షన్‌ల మంజూరితో పాటు ఎన్నికలలో ఇచ్చిన హామి ప్రకారం ఫెన్షన్‌లను పెంచి అర్హులకు అందించాలని లేనట్లయితే ప్రజా ఉద్యమాలు తప్పవన్నారు.

అజ్మతుల్లాహ్ హుసేన్‌కు శుభాకాంక్షలు తెలిపిన హరికృష్ణ



నవతెలంగాణ-సిద్దిపేట

బక్రీద్ పండగ సందర్భంగా తెలంగాణ వక్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లాహ్ హుసేన్‌ని ఆయన నివాసంలో సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మల యాదగిరి, కలిముద్దీన్, మంద పండు, వాహబ్, అజ్మత్, చిన్న, వంశీ, అరవింద్, మహేందర్, రాజిరెడ్డి, కన్నా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేద్దాం

- ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జంగపల్లి సాయిలు.
- నవతెలంగాణ-రాయపోల్



ఈ నెల 19 న సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఎమ్మార్పీఎస్ టిఎస్ కార్యవర్గం సమావేశం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ టిఎస్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు జంగపల్లి సాయిలు తెలిపారు. సోమవారం దౌల్తాబాద్ మండల కేంద్రం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఈనెల 19 న సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించే కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు మేడి పావన్న మాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు.సిద్దిపేట జిల్లాలోని ఎమ్మార్పీఎస్ టీఎస్ కార్యకర్తలు, ఉద్యమకారులందరూ హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో ఎజెండా అంశం విద్యా హక్కు చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా కార్యచరణ పై చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే చలో ఢిల్లీ కార్యక్రమం ఏర్పాట్ల విషయంలో, జులై 7 న దండోరా జెండా పండుగ ఏర్పాట్లు విషయంలో చర్చ సమీక్ష ఉంటుందన్నారు. భవిష్యత్ కార్యచరణ నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఉద్యమకారులు హాజరై సమావేశాన్ని జయప్రదం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు . ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అల్వాల్ స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్‌ను ఢీ కొట్టిన మోటార్ సైకిల్

వ్యక్తికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-కొండపాక

వ్యాన్‌ను మోటార్ సైకిల్ ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కొండపాక మండలం దుద్దెడ శివారులో మోటార్ సైకిల్ పై వెళ్తున్న తాడూరుకు చెందిన నర్సింహులు అనే వ్యక్తి అజాగ్రత్తగా నడుపుతూ సిద్దిపేట వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న వ్యాన్‌ను ఢీకొట్టాడు. దాంతో మోటార్ సైకిల్ పైనుంచి ఆయన రోడ్డుపై ఎగిరిపడ్డాడు తీవ్ర గాయాలు కావడంతో టోల్ ప్లాజా అంబులెన్స్ సిబ్బంది చేరుకొని ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

వృద్ధులకు బట్టల పంపిణీ



నవతెలంగాణ-సిద్దిపేట

వాసవి క్లబ్ వనిత ఆధ్వర్యంలో స్వయంవరం సిల్క్స్ వారి సహకారంతో వృద్దులకు బట్టలు పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షురాలు వాణి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ కూర ఉమాదేవి, శ్రీకాంత్, గాయత్రి, అరవింద్, సంధ్య, వినయ్, హయాన్స్‌ల ఆర్థిక సహాయముతో పట్టణ నిరాశ్రయుల ఆశ్రమంలో ఆడవారికి 20 మందికి చీరలు, మగవారి 8 మందికి దోతులు, లుంగీలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమాదేవి, శ్రీకాంత్, వినయ్ పాల్గొన్నారు.

మృతుడు కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని సలాఖపూర్, గ్రామానికి చెందిన కామిడి నరసింహ రెడ్డి, గత కొద్ది రోజుల క్రితం మృతి చెందడంతో, మృతుని కుటుంబానికి శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.5000 లు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా శివాజీ యూత్ సభ్యులు మాట్లాడుతూ ఏ ఇంటికి ఆపద వచ్చిన శివాజీ యూత్ ముందు ఉంటుంది అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివాజీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.


ఘనంగా బక్రీద్ సంబురాలు

- కులమత కులమత బేధాలు లేకుండా శుభాకాంక్షలు తెలుపుకున్న హిందూ, ముస్లిం సోదరులు



నవతెలంగాణ మిరుదొడ్డి: మిరుదొడ్డి, అంబర్పేట బొంపల్లి మండల వ్యాప్తంగా బక్రీద్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. త్యా గానికి ప్రతికగా జరుపుకునే బక్రీద్ పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని కో ఆప్షన్ సభ్యులు హైమద్ సూచించారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా దేవుడిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవనం సాగించాలని, బక్రీద్ పండుగ మానవాళికి గొప్ప సందేశాన్ని ఇస్తుందన్నారు. తమకు ఉన్నదాంట్లో నుంచి ఇతరులకు మంచి పెట్టడానికి మించిన దాతృత్వం మరొకటి లేదనే స్ఫూర్తిని బక్రీద్ పండుగ చాటి చెప్తున్నా డు తెలిపారు. అనంతరం మండలంలోని అన్ని గ్రామాల్లో ఈద్గ వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు నసరుద్దీన్ జాంగిర్ ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు రెండు ఆవులు మృత్యువాత



నవతెలంగాణ-కొండపాక

పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి చెందిన సంఘటన కుకునూరుపల్లి మండల పరిధిలోని ముద్దాపూర్ గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాలరాజు ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి బావి వద్ద చెట్టు సమీపంలో ఉంచిన ఆవులు పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాయని బాలరాజు కన్నీరు మున్నీరయ్యారు.

ఘనంగా బక్రీద్ పండుగ



నవతెలంగాణ-మద్దూరు

బక్రీద్ పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఈదుగా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీద్ పండుగ ఒక పవిత్రమైన పండుగ అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మర్కుక్

బక్రీద్ పండుగ పర్వదిన సందర్భంగా మండలంలోని పాములపర్తి, మర్కుక్, కర్కపట్ల, కాశిరెడ్డిపల్లి, చేబర్తి, దామరకుంట తదితర గ్రామాలలో ముస్లిం సోదరులు ఈద్ దర్గాల వద్ద పతేక్య ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో కర్కపట్ల మాజీ ఉప సర్పంచ్ అప్సర్, మైనారిటీ అధ్యక్షులు బాబా, అన్వర్, దస్తగిరి, అఫ్జాల్, యూసఫ్, చాంద్, యాసిన్, లతీఫ్, గణేష్ పల్లి గౌస్ ఖాన్, కాసీం, పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేర్యాల

బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం ముస్లిం మైనారిటీ సోదరులు చేర్యాల మండల కేంద్రంలోని ఈద్గా వద్ద బక్రీద్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయమే ముస్లిం మైనారిటీ సోదరులు ఈద్గా వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం సోదరులు మాట్లాడుతూ త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ ప్రతి ఒక్కరు మంచి శాంతియుత వాతావరణంలో జరుపుకున్నట్లు తెలిపారు. అనంతరం ముస్లిం సమాజానికి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక మదీనా మజీద్‌లో ముస్లిం సోదరులకు కలిశారు. బక్రీద్ పండుగ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేట

బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. నిరుపేదలకు తమకు తోచిన విధంగా దానాలు చేశారు. పండుగ సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.









నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సోమవారం ఘనంగా బక్రీద్ వేడుకలు నిర్వహించారు. ఉదయాన్నే ఆయా గ్రామాల్లో ప్రార్థన మందిరానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. నంగునూరు మండల పరిధిలోని నంగునూరు, పాలమాకుల, రాజగోపాల్ పేట, నర్మెట, నాగరాజు పల్లి, తిమ్మాయిపల్లి తదితర గ్రామాల్లో ఈద్గాలో ముస్లింలు పాల్గొన్నారు. ఒకరికి ఒకరు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు బక్రీద్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నంగునూరు మండలానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు రహీం పాషా, అజీజ్, గఫూర్, ఇమ్రాన్, జహీర్, కమాల్ షరీఫ్, సల్మాన్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.



ఇంకెన్నాళ్లో..? అసంపూర్తిగా ఆరోగ్య ఉప కేంద్రం

- నిర్మాణ దశలోనే గోడలకు పగుళ్లు
- త్వరితగతిన అందుబాటులోకి తీసురావాలని గ్రామస్తుల విజ్ఞప్తి

నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని బేగంపేట ఆరోగ్య ఉప కేంద్రం చుట్టూ గ్రామాల ప్రజలకు ఎంతో ఘనంగా వైద్య సేవలందించింది. శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారడంతో తొలగించారు. తొలగించిన కొన్నెండ్లు నూతన భవన నిర్మాణానికి నోచుకోలేదు. భవనాన్ని తొలగించి నాటి నుంచి నేటి వరకు గ్రామ పంచాయతీ అవరణంలో తాత్కాలికంగా కేటాయించిన భవనంలో గర్భిణులకు, రోగులకు ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్య సేవలందిస్తున్నారు. గతంలో ఎంతో ఘనంగా సేవలందించిన ఉప కేంద్రం వైద్య సేవలను మళ్లీ కళ్లారా చూడడం కలగానే మిగులుతోందనే ప్రజలు నిరాశకు ఎట్టకేలకు ముందడుగు పడింది. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వార మంజూరైన రూ.16 లక్షల నిధులతో నూతన ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి జూలై 5,2021న అప్పటి మానకోండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రజాప్రతినిధులు, సంబధిత అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. దీంతో ఆరోగ్య కేంద్రం సిబ్బందితో పాటు గ్రామస్తుల్లో ఆశలు చిగురించాయి. నిర్మాణ పనులు ప్రారంభమై కొన్ని నెలలు పునాదుల దశలోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు అసంపూర్తితో దర్శనమిస్తున్నాయి. వర్షాకాలం దృష్ట్యా ప్రజలు సీజనల్ వ్యాధులు బారిన పడే ప్రభావం ఉండడంతో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేసి ఆరోగ్య ఉప కేంద్ర భవనాన్ని అందుబాటులోకి తీసుకవచ్చేల సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నిర్మాణ దశలోనే పగుళ్లు..

నూతన ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనుల దశలోనే గోడలు పగుళ్ల బారిన పడుతున్నాయి. నిర్మాణ దశలో అధికారులు పర్యవేక్షణలో అలసత్వం వహించడం వల్లే నాణ్యత లోపాలు తలెత్తి పగుళ్ల ఏర్పడుతున్నాయని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆరోగ్య ఉపకేంద్రభవ నాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి నాణ్యత ప్రమాణాలతో భవన నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకవచ్చేలాదృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఎమ్మెల్యే కవ్వంపల్లి దృష్టి సారించాలి ..

అసంపూర్తి నిర్మాణ పనులతో నిలిచిపోయిన ఆరోగ్య ఉప కేంద్ర భవనం అందుబాటులోకి తీసుకవచ్చేల మానకొండూర్ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక శ్రద్ధ వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి వృత్తిరీత్యా వైద్యులవ్వడంతో ప్రజారోగ్యంపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

నిధులు లేకపోవడంతోనే..

- వినోద్ బాబ్జీ, వైద్యాధికారి, బెజ్జంకి

ప్రభుత్వం మంజూరీ చేసిన నిధుల మేరకు సంబంధిత గుత్తేదారు నిర్మాణ పనులు చేపట్టాడు. నిధులు లేకపోవడంతోనే ఆరోగ్య ఉప కేంద్ర నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. భవన నిర్మాణ పనులపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్తాను.

భూముల విలువలు పెరిగితే..

నవతెలంగాణ-గజ్వేల్

ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం కొంత వరకు మందగించిందని వ్యాపారులు మధ్యవర్తులు భావిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆగస్టు నుంచి భూముల వ్యాలిని పెంచుతామని ప్రకటించడంతో రియల్ వ్యాపారుల ముఖంలో కొంత ఉత్సాహం కనిపిస్తుంది. గత సంవత్సరం డిసెంబర్ 9న 2023లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రియల్ వ్యాపారం పై అసహనం వ్యక్తం చేసింది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూముల విలువను పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. భూమి విలువలు పెంచితే రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద కొంతవరకు ప్రభుత్వానికి ఆదాయం వచ్చి అవకాశం ఉంది. అంతేకాకుండా క్రయవిక్రయదారులకు సైతం ఎక్కువ డబ్బులకు భూమి అమ్ముడుపోతుందని ప్రభుత్వం భావిస్తుంది. ఆగస్టు నుంచి భూమి విలువను పెంచేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతుందని చెప్పాలి. అయితే భూమి విలువ పెంచితే రియల్ వ్యాపారం మరింత పెరుగుతుందా తగ్గుతుందా అనేది తెలియదు. భూమి విలువను ప్రభుత్వం పెంచిన తర్వాత రియల్ వ్యాపారులు గత సంవత్సరం డిసెంబర్ 9, 2023 ముందు కొనుగోలు చేసిన భూమి విలువ ఏ స్థాయిలో ఉంటుందో చెప్పలేం అంటున్నారు. ఎన్నికలకు ఆరు నెలల ముందు కొనుగోలు చేసిన భూములు ఇప్పటికీ అదే స్థాయిలో భూమి విలువ ఉందని రియల్ వ్యాపారాలు చెప్తున్నారు. సిద్దిపేట జిల్లాలో గజ్వేల్, దుబ్బాక, వర్గల్, ములుగు, జగదేపూర్, సిద్దిపేట, తదితర మండలాల్లో జీరో స్థితి వచ్చిందని రియల్ వ్యాపారం చేస్తున్న వ్యక్తులు చర్చించుకోవడం కనిపిస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం తిరిగి మూడోసారి కూడా వస్తుందని ఆశించి, ఇక్కడ ప్రాంతంలో వందలాది ఎకరాల భూమిని క్రయవిక్రయాలు జరిపారు. వేలాది ప్లాట్లను క్రయవిక్రయాలు నిర్వహించారు. ఎన్నికలు ముగిసి సుమారు ఏడు



నెలలు కావస్తున్నా రియల్ వ్యాపారం పుంజుకోవడం లేదు. ఎమ్మెల్యేల స్థాయి నాయకులు రియల్ వ్యాపారంలో తల పండిన నాయకులుగా వర్ధిల్లుతున్న సమయంలో ప్రభుత్వం ప్రభుత్వ భూములను ఇతర భూములను క్రయవిక్రాలు ఇప్పుడే జరపవద్దని ఆదేశించడంతో రియల్ వ్యాపారుల నోటిలో మట్టి పడ్డది. ధరణి వ్యవస్థ వచ్చిన తర్వాత ప్రభుత్వ భూములు ప్రైవేట్ భూములుగా మారినట్లు గతంలోనే రేవంత్ రెడ్డి ఆరోపాలు చేయడం ఇప్పుడు ఆయనే ముఖ్యమంత్రి కావడంతో మరింతగా పకడ్బంద్ చర్యలు తీసుకుంటున్నారు. ధరణి స్థానంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూమాత అనే వెబ్సైట్లను తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తుంది. దీంతో ఎవరికీ అన్యాయం జరగదని ప్రభుత్వ భూములు ప్రైవేట్ భూములుగా మారే అవకాశం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం అందులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నమ్మకం పెట్టుకున్నారు. ఏడు నెలల క్రితం ములుగు మండలంలో మూడెకరాల వ్యవసాయ భూమిని 88 లక్షలకు ఎకరాచొప్పున కొనుగోలు చేసిన వ్యక్తికి ఇప్పుడు ఒక ఎకరం 43 లక్షలు అడుగుతున్నట్లు సమాచారం. ఒక్కొక్క ఎకరంలో 40 లక్షలు లోటు వస్తుందని ఆ రియల్ వ్యాపారం చేస్తున్న వ్యక్తి ఏం చేయాలో దోచడం లేదు. గజ్వేల్ మండలం



శ్రీగిరిపల్లి సమీపంలో రెండు ఎకరాల వ్యవసాయ భూమిని ఒక రియాల్టర్ ఎకరం 35 లక్షల చొప్పున కొనుగోలు చేయగా ప్రస్తుతం 15 లక్షలకు అడుగుతున్నట్లు గజ్వేల్ ప్రధాన చౌరస్తాలో గత 20 రోజులుగా చర్చ జరుగుతుంది. గజ్వేల్ పట్టణంలో ఒక రియల్ వ్యాపారి ఒక వెంచర్ను 13 ప్లాట్లులో ఒక్కొక్క గజం రూ.20వేలకు కొనుగోలు చేయగా అదే వెంచర్లో ప్రస్తుతం 15 వేలకు గజం చొప్పున అడుగుతున్నట్లు ఆ వెంచర్ యజమాని చెప్పుకొచ్చారు. వర్గల్ మండలం తునికి కాల్స వద్ద ఆరు ఎకరాల వ్యవసాయ భూమిని రైతు వద్ద ఎకరాకు రూ.62 లక్షలకు కొనుగోలు చేసిన రియల్ వ్యాపారి ఆ రైతుకు కొంత డబ్బు చెల్లించారు. అదే భూమిని మూడో వ్యక్తికి చేతులు మారడంతో రూ.45 లక్షల చొప్పున ఇవ్వాలని అడగడంతో సుమారు ఒక్కొక్క ఎకరంలో రూ.15 లక్షల నష్టపోతున్నట్లు రియల్ వ్యాపారం చేస్తున్న వ్యక్తులు చర్చించుకోవడం కనిపించింది. గత పది సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ హయంలో రియల్ వ్యాపారం కొంత వరకు మూడు పువ్వులు ఆరు కాయలుగా ముందు సాగిన రియల్ వ్యాపారం ఒక్కసారిగా పడిపోవడంతో ఆ వ్యాపారిని నమ్ముకున్న మధ్యవర్తులు కొంత వరకు నష్టపోయినట్లు చెబుతున్నారు. రియల్ వ్యాపారం తగ్గడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయం కూడా క్రయవిక్రయాలు తగ్గినట్లు తెలుస్తోంది. ఆగస్టు నుంచి ప్రభుత్వం భూమి విలువను పెంచుతామని చెప్పడంతో రియల్ వ్యాపారంలో ముఖ్యంగా ఒకింత ఆశలు ప్రారంభమయ్యాయి.

గ్రామాల సమస్యలను నా దృష్టికి తీసుకురండి...!

- కాంగ్రెస్ నాయకులతో మంత్రి సమావేశం
- సమస్యలు లేకుండా చూడాలని
- అధికారులకు మంత్రి ఆదేశం

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

గ్రామాలలోని ప్రతి సమస్యను నా దృష్టికి తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సోమవారం హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హుస్నాబాద్ మండల పార్టీ నేతలతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశమయ్యారు. గ్రామాల్లో రోడ్లు, మురుగు కాలువలు నిర్మాణం, చెరువుల అభివృద్ధి తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాలలో ఎలాంటి సమస్యలైనా అధికారులు ముందుండి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు తెలపాలన్నారు. ఈ నెల 21న హుస్నాబాద్ నియోజకవర్గం లోని ఏడు మండలలో విడతల వారిగా గ్రామాల్లో పర్యటిస్తానని అన్నారు. 24వ తేదిన హుస్నాబాద్



తిరుమల గార్డెన్‌లో జాబ్ మేళా ఏర్పాటు చేశామన్నారు. అర్హతలను బట్టి ఉద్యోగాలు ఉంటాయని పేర్కొన్నారు. ఏ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయో వాటిని గుర్తించి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు గ్రామాల వారిగా సమస్యల పరిష్కారానికి ముందుండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, చిత్తారి రవీందర్, తదితరులు పాల్గొన్నారు .

బాధిత కుటుంబాలను పరామర్శించిన మంత్రి పొన్నం



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలను సోమవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పంతులు తండా గ్రామానికి చెందిన కరెంటోత్ స్వరూప, కవిత ఇటీవల బస్సు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. వారి నివాసానికి వెళ్లి చిత్రపటాలకు నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రభుత్వపరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే ఈ ప్రమాదంలో గాయపడ్డ రాజు ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. అనంతరం అక్కన్నపేట మండల ప్రజాపక్షం రిపోర్టర్ ఈశ్వర్ తండ్రి నారదాసు రమేష్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. తదనంతరం నమస్తే తెలంగాణ రిపోర్టర్ గొట్టే సంపత్ ఈ మధ్యకాలంలో ప్రమాదానికి గురై గాయాల పాలయ్యారు. వారి ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, గిరిజన నాయకులు తిరుపతి నాయక్, అక్కన్నపేట గ్రామ శాఖ అధ్యక్షులు చింతల మల్లారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు చింతల బాలరాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పీరెళ్ల లింగమూర్తి, యూత్ కాంగ్రెస్ నాయకులు మునిరాజు, మైనార్టీ నాయకులు అక్బర్, పాల్గొన్నారు.